క్లుప్తంగా

పాడి పశువుల పోషణ మెలకువలపై సదస్సు

గన్నవరం: పాడి పశువుల పోషణను లాభసాటిగా మార్చుకునేందుకు సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలని ఎన్టీఆర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి. శ్రీదేవి సూచించారు. కళాశాలలో పశుపోషణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పాడి పశువుల పోషణలో మెలకువలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశుపోషణ విభాగాధిపతి డాక్టర్ కె.రాజకిషోర్ అధ్యక్షతన డాక్టర్ పి.కవిత, డాక్టర్ వెంకటశేషయ్య, డాక్టర్ ఎస్. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు:గంగూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఈఈ పి.హరిబాబు తెలిపారు. మరమ్మతులు కారణంగా ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. పెనమలూరు, గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సిబ్బందితో సహకరించాలని కోరారు.

వ్యాయామం ద్వారా మెరుగైన ఫలితాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: దివ్యాంగులకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయించటం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఫిజియోథెరపిస్ట్ శ్యాం ప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని మెయిన్ ఎంపీపీ పాఠశాలలో గురువారం ఉచిత ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. దివ్యాంగులకు వివిధరకాల వ్యాయామాలు ఎలా చేయించాలో తల్లిదండ్రులకు తర్ఫీదు ఇచ్చారు. ఎంఈవో-2 సురేష్ కుమార్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు కె.సుశీల, జె.నాగమణి పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు: యువతి అదృశ్యంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపిన కథనం మేరకు... మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన యువతి (19) ఇంటర్ వరకూ చదువుకుంది. ప్రస్తుతం ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్టులో నర్సింగ్ శిక్షణ పొందుతోంది. జూన్ 14న కాలేజీకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. స్థానికంగా విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈనెల 7న యువతి తల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అందుబాటులోకి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

- రూ.10 లక్షలతో సమకూరిన నూతన సాంకేతిక సామగ్రి
- నేడు ప్రారంభం కానున్న భవనం
- కంకిపాడు కేంద్రంగా నియోజకవర్గ స్థాయి నిర్ధారణ పరీక్షలు



ప్రారంభానికి సిద్ధమైన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

కంకిపాడు: కంకిపాడు కేంద్రంగా నిర్మించిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఎట్టకేలకు అందుబాటులోకి రానుంది. సాంకేతిక పరికరాలను సమకూర్చటంతో పశువులు, జీవాలకు అవసరమైన పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు అందనున్నాయి. మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రయోగశాల భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గ స్థాయిలో....

గతంలో పశువులు, జీవాలకు సంబంధించిన ఏ చిన్న వ్యాధులకైనా నిర్ధారణ పరీక్షలు విజయవాడలోని ప్రధాన పశువైద్య కేంద్రంలో జరిగేవి. దీంతో శివారు ప్రాంతాల నుంచి పశుపోషకులు, జీవాల పెంపకం దారులు ఆయా సేవలను పొందేందుకు వ్యయప్రయాసలకోర్చి పొందాల్సి వచ్చేది. గత ప్రభుత్వం పశువ్యాధి నిర్ధారణ పరీక్షలకు భవనాన్ని కంకిపాడు పశువైద్య కేంద్రం స్థలం ప్రాంగణంలో నిర్మించారు. కానీ అందులో అవసరమైన సాంకేతిక పరికరాలను మాత్రం సమకూర్చలేదు. దీంతో ప్రయోగశాల సేవలు అందుబాటులోకి రాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పశు, జీవాల పెంపకం దారులకు వెన్నుదన్నుగా నిలిచింది. నియోజకవర్గస్థాయిలో పశు, జీవాల వ్యాధి నిర్ధారణ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు సుమారు రూ.10 లక్షలు అంచనా వ్యయంతో అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూర్చింది. రక్తం, మలం, పాలు, ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు కంకిపాడు కేంద్రంగా పశువులు, జీవాలకు అందనున్నాయి. ప్రయోగశాలలో నిర్ధారణ పరీక్షలు చేసేందుకు టెక్నీషియన్, సహాయ సిబ్బందిని కూడా నియమించారు. పశువైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రయోగశాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందనున్నాయి. నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల స్థాయిలో ఆయా మండలాల్లో ఉన్న పశువులు, జీవాలకు రానున్న రోజుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందనుండటం పట్ల పెంపకందారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు భవనం ప్రారంభం...

మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా ఈనెల 8వ తేదీ 11 గంటలకు పశువైద్య కేంద్రం ప్రాంగణంలోని ప్రయోగశాల భవనం ప్రారంభం కానుంది.



ప్రయోగశాలలో సమకూరిన సాంకేతిక పరికరాలు

వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయోగశాల భవనాలను ప్రారంభించగానే ఎమ్మెల్యే పార్థసారథి చేతులమీదుగా ప్రయోగశాలలను ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

కమిషనర్ ప్రకాశరావు



కానూరు సచివాలయంలో సర్టిఫికెట్లు అందిస్తున్న కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు:ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. కానూరు సచివాలయం 3లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే వలంటీర్లు, వార్డు సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకొచ్చి వివరాలు నమోదు చేయించాలని సూచించారు. జగనన్న సురక్షలో అవి వెంటనే పరిష్కారం చేస్తామని తెలిపారు. ఏ సమస్యలు ఉన్నా అవి కూడా తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్లస్టర్ ఇన్‌చార్జ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చాంద్‌బాషా మాట్లాడుతూ జగనన్న పాలనలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ప్రతి ఇంట్లో సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా 397 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటశివయ్య, వైఎస్సార్ సీపీ నేతలు సిద్ధిఖ్, వేమూరి బాలకృష్ణ, ఖాదర్, లతీఫ్, రెహమాన్, అంగిరేకుల సీతారామయ్య, తుమ్మల వరదీష్, సైకం శివప్రసాద్, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీ

గన్నవరం: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం -1, 2లో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న 481 మందికి ఆదాయ, 545 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు, 31 మందికి ఇతర సర్టిఫికెట్లను అందజేశారు. 58 మందికి ఆధార్ సంబంధిత సేవలందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చారని తెలిపారు. పలు కారణాలు వల్ల సంక్షేమ పథకాలు పొందని వారికి లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. నియోజకవర్గంలో రెండవ విడత నివేశన స్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇంతగా మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గొసాని, గుడివాడ ఆర్డీవో పద్మావతి, మండల ప్రత్యేకాధికారి, జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, తహసీల్దారు సీహెచ్ నరసింహారావు, ఎంపీడీవో సత్యకుమార్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రూ.కోటితో అంతర్గత రహదారుల అభివృద్ధి

ఎస్ఈ విజయకుమారి



కాలనీలో రహదారులు పరిశీలిస్తున్న ఎస్ఈ విజయకుమారి, ఏఈ వెంకటేశ్వరరావు

పెనమలూరు: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో అంతర్గత రహదారుల అభివృద్ధికి రూ.కోటితో అంచనాలు వేశామని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ కె.విజయకుమారి తెలిపారు. పెనమలూరు జగనన్న కాలనీలో అంతర్గత రహదారులు సక్రమంగా లేవని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకురావటంతో ఆమె శుక్రవారం జగనన్న కాలనీకి వచ్చి పరిశీలించారు. ఎస్ఈ విజయకుమారి వివరాలు తెలుపుతూ రూ.15 లక్షల మండల పరిషత్ నిధులతో రోడ్డు వేశామన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు రూ.15 లక్షలు మంజూరు చేయటంతో రోడ్డు నిర్మాణానికి అనుమతులు కోరామన్నారు. ఇదే కాకుండా కాలనీలో ఆరు నిలువు రోడ్లు, 3 అంతర్గత అడ్డ రోడ్లు, నాలుగు కల్వర్టులు, రహదారులు అడుగున్నర మెరక చేయటానికి రూ.కోటితో అంచనాలు వేసి జిల్లా కలెక్టర్‌కు పంపామన్నారు. నిధులు మంజూరు చేయగానే అంతర్గత రహదారుల నిర్మాణం వెంటనే చేపడతామని వివరించారు. స్థానికంగా ఉన్న లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సర్పంచ్ లింగాల భాస్కరరావు, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వెంకటాపురం ఇనాం భూముల రైతుల కృతజ్ఞతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వెంకటాపురం ఇనాం భూముల సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌లకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు సింగవరపు చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటాపురం ఇనాం భూములను సెక్షన్ 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ కలెక్టర్ పి.రాజాబాబు ఉత్తర్వులు జారీచేయటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. గ్రామంలోని వెలమ సంఘం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వచ్చారు. దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేత

కంకిపాడు: అనారోగ్యంతో బాధపడుతున్న ముప్పిరి రాజేష్ కుటుంబానికి కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుజ్జి) రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం బాధిత కుటుంబానికి సొమ్ము అందజేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ కోలవెన్ను గ్రామానికి చెందిన రాజేష్ కొద్ది కాలంగా కాలేయ సమస్యతో బాధపడుతున్నాడన్నారు. కాలేయ మార్పిడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేశారన్నారు. ఆ సొమ్ముతో వైద్యం అందుతుందన్నారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవాలు



ఉయ్యూరు: శాకంబరీ ఉత్సవాలు ఉయ్యూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం, విజయదుర్గాభవాని దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను కూరగాయలతో విశేషంగా అలకరించారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని తరించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



విరాళం అందిస్తున్న దృశ్యం

పెనమలూరు:గోసాల గ్రామం వైకుంఠపురంలో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గ అమ్మవారి ఆలయానికి భక్తురాలు శుక్రవారం రూ.50 వేలు విరాళం అందించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత మురళీ భార్య విజయ అమ్మవారి ఆలయ నిర్మాణానికి తన వంతు సాయంగా కమిటీ సభ్యులకు విరాళం అందచేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు ముందుకు వచ్చి అమ్మవారికి విరాళాలు ఇస్తున్నారని, త్వరలో అమ్మవారి గుడి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు పీర్ అహ్మద్, కమిటీ సభ్యులు ఆకుల సుశీల, ఝాన్సీ, లక్ష్మి, కృష్ణవేణి, కుమారి, కోటి పలువురు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం



సర్టిఫికెట్ అందచేస్తున్న సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీతాశర్మ



ఉయ్యూరులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి



మంతెన సచివాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

పెనమలూరు:జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమవుతున్నాయని గోసాల సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు అన్నారు. గోసాల వైకుంఠపురంలో శుక్రవారం సచివాలయం 2లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాంతో పాటు నేడు జగనన్న సురక్షతో సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ప్రజల సమస్యలు ఇంత వేగంగా పరిష్కారం చేయలేదని గుర్తు చేశారు. జగనన్న ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేసి అనేక కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జగనన్నకు ప్రజలు అండగా ఉంటే జగనన్న సేవలు కూడా ఎల్లకాలం ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా 183 మందికి సర్టిఫికెట్లు అందచేశారు. ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు రవి, పీర్ అహ్మద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గొప్పవరం

ఉయ్యూరు: జగనన్న సురక్ష గొప్ప వరమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని 7, 9 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం 4వ వార్డు సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో సీఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇంటింటి సర్వే ద్వారా గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తూ ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు వడుపు గంగా భవాని, ఊర శ్రీవాణి పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో జగనన్న సురక్ష నిర్వహించి 190 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించారు. మండల ప్రత్యేకాధికారి జె.జ్యోతి, సర్పంచ్ వెనిగళ్ల శిరీష, ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మంతెన, నెప్పల్లి గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన పేదలకు 11 రకాల సేవల ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్, సర్పంచులు వీరంకి వెంకటరమణ, పిన్నబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు, ఈఓ కూర్మారావు పాల్గొన్నారు. నెప్పల్లి గ్రామంలో నిర్వహించిన సభలో 604 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. మండవ కిషోర్, కొణతం గిరిధర్, బత్తుల కామేశ్వరరావు, గుజ్జుల కోటేశ్వరరావు, నర్రా రమేష్‌బాబు, రాయసం రమణ, ఈఓ శివకుమార్ పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని పొట్టిపాడు గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కుల ధ్రువీకరణ 102, ఆదాయ 98, ఆధార్ మొబైల్ లింక్ 33, సీసీఆర్‌సీ కార్డులు 5 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ వి.సరోజిని, పొట్టిపాడు, ఎస్‌ఏ పేట గ్రామ సర్పంచులు కత్తుల జ్యోతి, ఎన్.నాగరాజు, ఎంపీడీవో శేషగిరిరావు, ఈఓఆర్డీ బాషా తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి శాకంబరి అలంకరణ



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో లాకుల వద్ద వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో యువి.ప్రసాదరావు, ప్రధాన అర్చకుడు ఎస్.కోటేశ్వరరావు భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ చేశారు.

రామవరప్పాడు: వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవార్లు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కూరగాయలు, పండ్లతో అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ మాట్లాడుతూ అమ్మవార్లకు అలంకరించిన కూరగాయలు, పండ్లను శనివారం భక్తులకు ప్రసాదంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, ధర్మకర్తల మండలి సభ్యుడు మత్తె కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ ప్రజా సంక్షేమం

ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: ఇంటింటా సంక్షేమాన్ని అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 13, 14 వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించి సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అర్హులకు రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ప్రభుత్వంపై బురదచల్లేపని చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలు సాగిస్తున్న నీచ కుట్రలను ప్రజలే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేషబాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు పైలా శ్రీనివాసరావు, కూరాడ వెంకటలక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, తెనాలి పద్మావతి తదితరులున్నారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఫీజుల దోపిడీ అరికట్టాలి



పెనమలూరు: కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అడ్డుకుని పేద, మధ్య తరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యు నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.వైష్ణవ్, ఆర్. వేణు అన్నారు. కానూరులో ఇంటర్మీడియెట్ ఆర్ఐవో కార్యాలయంలో ఏవో అరుణకు వినతిపత్రం ఇచ్చి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు నేతలు వివరాలు తెలుపుతూ రాష్ట్రంలో 439 ప్రభుత్వ, 131 ఎయిడెడ్ కాలేజీల్లో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుతున్నారన్నారు. కాలేజీలో ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేసి విద్యార్థులపై భారం మోపుతున్నారని ఆరోపించారు. కాలేజీల్లో కనీస వసతులు కూడా ఉండటం లేదన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఫీజులు నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీ చేయాలని కోరారు. ఏఈఈఈ, నీట్ పేరుతో కార్పొరేట్ కాలేజీలు చేస్తున్న దోపిడీ పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యు నేతలు మోహన్, భరత్, జస్వంత్, చంద్ర పలువురు పాల్గొన్నారు.

పార్వతీదేవికి ఆషాఢ సారె



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో పార్వతీ అమ్మవారికి శుక్రవారం ఆషాఢమాస సారె సమర్పించారు. దేవస్థానానికి వెలగపూడి సాంబశివరావు, లక్ష్మి దంపతులు అమ్మవారికి చీర, గాజులు, కుంకుమ, పసుపు పండ్లు ఇతర పూజా సామగ్రితో వచ్చి పార్వతీ అమ్మవారికి ఆషాఢమాస సారె అందించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు సాగర్ అమ్మవారి ఆషాఢసారె స్వీకరించారు. అనంతరం మహిళా భక్తులు పెద్ద ఎత్తున పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. రామలింగేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ ఈవో గంగాధరరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరంతో పాటు దావాజిగూడెం, మర్లపాలెం, చిన్నఅవుటపల్లి, అల్లాపురం, దుర్గాపురం, బీబీ గూడెం, గొల్లనపల్లి, చిక్కవరం ఇండస్ట్రీస్ ప్రాంతాల్లో పైన తెలిపిన సమయంలో విద్యుత్ ఉండదని సూచించారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు

నున్న(విజయవాడరూరల్): జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ మీటర్లు అందజేస్తుందని డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీరు బాలాజీనాయక్ తెలియజేశారు. నున్న గ్రామంలో శుక్రవారం జగనన్న కాలనీలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం 2,500 రూపాయల విలువ చేసే ఎంసీడీ బోర్డు(విద్యుత్ మీటర్లు, వైరు) ఉచితంగా అందజేస్తుందన్నారు. ఇప్పటివరకు నున్న సబ్‌స్టేషన్ పరిధిలో 460 మంది లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లను ఉచితంగా అందజేశామన్నారు. ఇంకా కావాల్సిన వారు ఆధార్ కార్డు, ప్లాటు నెంబరు వివరాలతో స్థానిక అధికారిని సంప్రదించవచ్చునని తెలియజేశారు. జగనన్న కాలనీల కోసం నున్న(శాంతివనం), సూరంపల్లి గ్రామాల్లో 33/11కేవీ సామర్థ్యంగల విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించామన్నారు. వ్యవసాయ కనెక్షన్లు తీసుకునే రైతులకు మూడు స్తంభాల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు త్వరితగతిన కనెక్షన్లు ఇస్తున్నామన్నారు.

వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కేసు నమోదు

పెనమలూరు: దురలవాట్లకు బానిసగా మారిన భర్త భార్యను వేధిస్తుండటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప టీచర్స్ కాలనీకి చెందిన ఎ.సౌమ్య 2010 సంవత్సరంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న రవికుమార్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు పుట్టారు. అయితే భర్త అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో ఆమె గత కొద్ది కాలంగా వేరేగా పిల్లలతో ఉంటుంది. భర్త భార్య ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి బెదిరిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు భర్త పై కేసు నమోదు చేశారు.